# మళ్ళీ చెప్పిన కథలు

# పండితుడు - రాజు

— రావి కొండలరావు

ఒకానొక రాజ్యంలోని రాజుగారు నిండు కొలువు తీర్చి తీరిగ్గా కూచున్నారు. ఎత్తయిన సింహాసనం మీద ఆయన, ఆ సింహాసనానికి అటు ఇటుగా ముఖ్యమంత్రి, ఉప మంత్రులు, సహాయ మంత్రులు, సామంతులూ కూచున్నారు. ఆ రాజుగారికి తెలివి, జ్ఞానం మాట ఎలా వున్నా తిథులు, వారాలు, వర్జ్యాలు, నక్షత్రాలు మీద మాత్రం మహా నమ్మకం, మహా పిచ్చి. ఆ కొలువులో దేశం, ప్రజ, వాళ్ళ సమస్యలూ చర్చించకుండా ఏవో పోచికోలు కబుర్లు, పొల్లు మాటలూ చెప్పుకుని అంతా కాలక్షేపం చేస్తున్నారు. చమత్కారం పేరుతో రాజుగారు ఏ చెత్త చెప్పినా, అంతా చేతులు వాచేలా చప్పట్లు కొట్టేసి, కూచున్న ఆసనాల మీద నుంచి ఎగిరెగిరి, గొల్లున నవ్వేస్తూ పొట్టలు చేత్తో



పట్టేసుకుంటున్నారు. ఆ వాతావరణం అంతా అలా నవ్వులాటగా వున్న సమయంలో ఒక పండితుడు రాజదర్శనార్థం వచ్చాడు. రమ్మనమన్నాడు రాజుగారు. పండితుడు ప్రవేశిస్తూనే తన పాండిత్యం ప్రదర్శిస్తూ మహారాజుని పొగిడాడు. ఆ రాజు 'చెవిటివాడు' అనుకుంటే, ఆ కవిత్వం అతని ముందు 'శంఖం' అయింది. పండితుడి ప్రశంస రాజుకేమీ అర్థం కాలేదు. తక్కినవాళ్ళకి అసలేమీ అర్థం కాలేదు. "పళ్ళెంలో పెట్టిన పనస తొనలు చూసి, దిక్కు దిక్కులు చూశాట్ట" అన్న సామెత కథ చందం అయింది.

"ఇంతకీ ఏమంటారు మీరు? ఏం కావాలి మీకు?" అని రాజు పండితుణ్ణి ఎగాదిగా చూస్తూ విచారించాడు. ఆ రాజు వట్టి శుంఠ అనీ, తాను అనవసరంగా కవిత చదివాననీ పండితుడు గ్రహించి "హుఁ" అని తాను విచారించాడు. నిరాశానిస్పృహలతో తిరిగి వెళ్ళిపోతున్న పండితుణ్ణి రాజుగారు చప్పట్లు కొట్టి, వెనక్కి పిలిచి, "ఇంతకీ మీ దగ్గరున్న ఆ పుస్తకాలో, గ్రంథాలో అవేమిటి? రేపు తిథి ఏమిటో, వర్జ్యం ఎప్పుడొస్తుందో చెప్పండి పోనీ, ఓ అర వరహా దానం ఇచ్చుకుంటాను" అన్నాడు. పండితుడు ఒళ్ళు 'మండి'తుడయ్యాడు!

"ఈ పుస్తకాలన్నీ పాండిత్యం పంచాంగం కాదు" అన్నాడు కనుబొమలు వీలైనంత పైకి తీవ్రంగా ఎత్తి. రాజుగారు గొల్లుగొల్లున నవ్వాడు. ఆ నవ్వుకి తక్కినవాళ్ళంతా వంతపాడి ఇంకా ఘొల్లుమన్నారు. "తిథి, వర్జ్యం చెప్పలేని ఆ పుస్తకాలెందుకు? మీ పాండిత్యం ఎందుకు? దయచేసి వచ్చిన దారినే దయచేయండి" అన్నాడు రాజు ఒట్టు పెట్టుకున్నట్టు మళ్ళా వెనక్కి తిరిగి చూడకుండా, చరచరా వెళ్ళిపోయాడు పండితుడు — అతిహాసా సముద్ర ఘోష మధ్య.

కాలచక్రంలో తిథులు కొన్ని తిరిగాయి. ఓ రోజున పండితుడు వీథిన పోతూవుండగా రాజుగారు సపరివారంగా గుర్రం మీద ఊరేగుతూ అతనికి ఎదురయ్యారు. పండితుణ్ణి చూసి ఆగి, ఎక్కడో చూసినట్టుందే అన్నట్టు ఎగాదిగా పరిశీలించారు. పండితుడు విధేయత గలవాడై, వాడైన నమస్కార బాణం ఒకటి వదిలి, "నేను ప్రభూ! పండితుణ్ణి. ఓ రోజున తమ సభలో తమని కీర్తిస్తే నా గ్రంథాల్లో వర్జ్యాలు, తిథులు అడిగి తమ అజ్ఞానాన్ని బయట పెట్టుకుని, నన్ను అనుమానించారే, ఆ పండితుణ్ణి" అన్నాడు సవినయంగా. రాజు వెంట వున్న బంధుమిత్ర సైన్య, అధికార, ఆశ్రిత పరివారం రాజు నవ్వకపోయినా హోరుమని నవ్వింది. సభలో తనని అవమానించిన రాజుని నడి వీథిలో తాను అవమానించాలనుకున్నాడు పండితుడు. "మహారాజా! నా గడ్డం మాసింది. క్షురకర్మకు కర్త దొరకలేదు. తమ ఒరలో వున్న ఆ పెద్ద కత్తి ఓసారి ఇస్తారా నున్నగా గడ్డం చేసుకుంటాను" అని అడిగాడు. ఆ మాటకి పరిజనం అంతా "ఆఁ" అని, కత్తులు దుయ్యగా, ఊరేగింపు చూస్తున్న పురజనం "హా!" అని ముక్కున వేలేసుకున్నారు. ఎండా కాలం మిట్టమధ్యాహ్నం వేళ సూర్యుడు మండిపడ్డట్టు మండి పడ్డాడు రాజు. గుర్రం మీద నుంచి "పండితా! ఇది యుద్ధంలో శత్రువుల్ని చీల్చి చెండాడే కత్తి. గడ్డం గీసే కత్తి కాదు. తెలుసా?" అన్నాడు తీవ్రంగా. పండితుడు పకపకా నవ్వాడు. "గడ్డం గీయడానికి పనికిరాని కత్తి కూడా ఓ కత్తేనా — ఎందుకూ, లాగి అవతల పారేయండి" అన్నాడు — నవ్వు ఆపుకుంటూ పోగయి విస్తుపోయి చూస్తున్న జనాన్ని చూస్తూ. "మహారాజా! ఆనాడు మీరు సభలో అతని గ్రంథాల్ని చూసి పంచాంగం అడిగారని, ఆ కక్షతో తమని ఇలా పురవీథిలో, ప్రజా సమక్షంలో దారుణంగా అవమానపరిచాడీ పండితుడు. తాము దిట్టంగా శిక్షించండి" అని సలహా ఇచ్చాడు ప్రధాన మంత్రి.

"అవును. ఈ పండితుణ్ణి తక్షణమే చెరసాలలో బంధించండి. ఏ కత్తిని అవమానించాడో, అదే కత్తితో, అనగా ఈ నా కత్తితో రేపు సూర్యోదయంలోగా అతని తలని ఖండించండి!" అని ఆనతిచ్చి, భటులకా కత్తిచ్చి, గిరుక్కున తిరిగి వెళ్ళిపోయాడు రాజు — పరివారం వెంట రాగా. రాజ ఖడ్గం ధరించిన భటులు పండితుణ్ణి బంధించి, చెరలో తోశారు.

సూర్యుడింకా లేవక ముందే రాజగారు లేచి, పండితుడి శిక్షని స్వయంగా అమలుపరచాలని చెరసాల దగ్గరకు వేంచేశారు. "ఆ మూర్ఖ పండితుణ్ణి బయటకి లాగండి. నా మాట ప్రకారం సూర్యోదయం కాకముందే శిరచ్ఛేదనం చెయ్యండి. ఊఁ" అన్నాడు రాజు గంభీరంగా కళ్ళు, నోరూ, నాసలు, మీసం అన్నీ విశాలపరుస్తూ. భటులు పండితుణ్ణి బయటకి లాగి, తూర్పు దిక్కుకు ముఖం తిప్పి నిలబెట్టారు. నిలబెట్టి తల మీద చేతులు వేశారు. చేతులు వేసి తల కిందికి వంచారు. మసక వెలుగులో కూడా ధగ ధగ మెరిసిపోతున్న రాజుగారి కత్తిని ఇద్దరు భటులూ చెరో చేత్తోనూ పైకెత్తారు. "ఆగండి" అని అరిచాడు పండితుడు. వాళ్ళు ఆగారు.

"ఇది దోష కాలం. ఈ ముహూర్తంలో ఒక పండితుణ్ణి చంపితే, రాజుగారి యావత్తు కుటుంబానికీ కీడు మూడుతుంది. ఇది పిశాచ యోగం. గండ కాలం. అంచేత, ఒక అర్థ ఘడియ పాటు ఆగి, అప్పుడు నరకండి నన్ను" అన్నాడు పండితుడు అలా తల వంచి వుంచే. తిథి, కాలం, యోగాల మీద పిచ్చి నమ్మకం గల రాజావారికి ఆ మాట వినగానే దిమ్మతిరిగినట్టయింది.

"భటులారా! ఐతే ఆగండి. అర్థ ఘడియ కాగానే నరకండి" అన్నాడు. అరఘడియ కాలం పూర్తికాగానే "కానీండి" అని అరిచాడు రాజు. భటులు మళ్ళీ కత్తి ఎత్తారు. "మళ్ళీ ఆగండి" అన్నాడు పండితుడు మళ్ళీ. వాళ్ళు మళ్ళీ ఆగారు. "మళ్ళీ ఏమిటి?" అని అడిగాడు రాజు. "అవధరించండి. తమ మాట ప్రకారం ఈనాటి సూర్యోదయ కాలానికి ముందే నన్ను శిక్షించాలి. అటు చూడండి. సూర్యోదయం జరిగిపోయింది. కనక, తమ శాసనానుసారం నా తల ఉత్తరించే హక్కు మీకు లేదు. మాట మీద నిలిచే ప్రభువులవారు చిత్తగించాలి" అన్నాడు పండితుడు తెలివి కన్నులతో చూస్తూ. దెబ్బతిన్న కళ్ళతో రాజుగారు భటుల వంక చూశాడు. వికసించిన కళ్ళతో భటులు 'అవును గదా మరి' అన్నట్టు తలలూపారు. నాలిక కరచుకున్న రాజుగారు తలదించుకున్నారు. నోట్లో నాలిక గల పండితుడు తల ఎత్తాడు. అరుణ కిరణ కాంతుల్లో మెరుస్తున్న చిరునవ్వుతో, ఎత్తిన తల దించకుండా నిటారుగా, నిబ్బరంగా నడిచిపోయాడు — పండితుడు. ●